క్లుప్తంగా

హర్షిత్ ప్రతిభ

భామిని: మండలంలోని గురండి విద్యావికాస్ స్కూల్ విద్యార్థులు భగవద్గీత, స్పెల్ బీ పోటీల్లో జిల్లా స్థాయిలో అవార్డులు సాధించారు. భగవద్గీత జూనియర్ విభాగంలో గురండి స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థి తాళాసు హర్షిత్ గెలుపొందారని ప్రిన్సిపాల్ గాంధీరాజు మంగళవారం తెలిపారు. స్పెల్ బీలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో పి.ప్రశాంతి, ఎస్.అస్మిత నిలిచి బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు.

డీలరు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వీరఘట్టం: మండలంలో 7 రేషన్ డిపోల్లో ఖాళీగా ఉన్న డీలరు పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చలివేంద్రి, చిదిమి, కడకెల్ల డీలరు పోస్టులు జనరల్ మహిళలకు, అడారు బీసీ–ఏ మహిళకు, తెట్టంగి ఎస్టీ మహిళకు, బూరుగ ఎస్సీ జనరల్, కుమ్మరిగుంట బీసీ–ఈ జనరల్ కేటగిరీలకు కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి, 18 – 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగి స్థానికులై ఉండాలన్నారు. దరఖాస్తులను పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం లేదా వీరఘట్టం తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ లోగా అందజేయాలని సూచించారు.

ఏరియా ఆస్పత్రిలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం నుంచి ఆప్తాలమి సదరం క్యాంప్ ప్రారంభమైందని సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. 5గురుకి నేత్ర పరీక్షలు చేశామన్నారు. ఇప్పటికే ఆర్థో సదరం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డి.వి. శ్రీనివాస్, నేత్ర వైద్యులు రేఖా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మానవ హక్కుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుశాంత్ జనా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఎలాంటి వివక్షత లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. జాతి, మత, రాజకీయ, వ్యక్తిగత కారణాలతో ఇబ్బందులకు గురికాకూడదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మహాసభలో మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఉద్యమించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతి పిలుపునిచ్చారు. కురుపాం మండల కేంద్రంలోని రావాడ జంక్షన్ వద్ద మంగళవారం నిర్వహించిన ఆ పార్టీ పదో జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం గాలికొదిలేసి, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఆరోగ్య తనిఖీలు



ఆరోగ్య తనిఖీల నిమిత్తం సీహెచ్‌సీకి వచ్చిన ట్రాన్స్‌జెండర్లు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం సీహెచ్‌సీ వద్ద ట్రాన్స్‌జెండర్లకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి, సిబ్బంది కలిసి వారికి బీపీ, సుగర్, హెచ్‌బీ, హెపటైటిస్, హెచ్ఐవీ పరీక్షలు చేసి, ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు.

టీకాలతో జీవాలకు రక్షణ

- ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం
- మసూచితో తస్మాత్..
- గాలి కుంటు వ్యాధీ ప్రమాదమే..



దోనుబాయి పశువైద్యాధికారి పర్యవేక్షణలో టీకాలు వేస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్లో) శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ ఏడీ

సీతంపేట: చలి బాగా పెరిగింది. ఈ సీజన్‌లో జీవాలు(గొర్రెలు, మేకలు) పట్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది. ఈ క్రమంలో ప్రబలే వ్యాధులకు తగిన టీకాలు వేయించడం ద్వారా అదుపు చేయవచ్చని, జీవాలకు రక్షణ కల్పించవచ్చని పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యంగా మసూచి, గాలికుంటు వ్యాధి వంటివి పొంచి ఉన్నాయని, వాటితో అప్రమత్తంగా లేకుంటే జీవాలకు ప్రాణహాని తప్పదని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఏజెన్సీలో విస్తృతంగా జీవాలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడుతూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేపట్టారు.

మసూచి

బొబ్బ, అమ్మతల్లి, అమ్మోరు అని అంటారు. వైరస్ వల్ల కలుషితమైన మేత, నీరు, గాలి ద్వారా సోకుతుంది.

లక్షణాలు : జ్వరం 106 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. తోడ, తోక క్రింద భాగాల్లో, పెదవులు, కనురెప్పలు, జననేంద్రియాలలో పొక్కులు ఏర్పడతాయి. నోటి నుండి చొంగ, ముక్కు నుంచి చీమిడి కారుతుంది. కళ్ల నుంచి నీరు, ముక్కు నుంచి చీము కారుతుంది. శ్వాస కష్టమౌతుంది. చూడి జీవాలు ఈడుసుకోని పోతాయి.

చికిత్స : బొబ్బలకు హిమాక్స్, వేపనూనె పూయాలి. అంటి హిస్టమైన్ ఇంజక్షన్లు 3–5 రోజులు చేయాలి.

నివారణ : ప్రతి సంవత్సరం నవంబర్ మాసంలో టీకాలు వేయించాలి.

గాలికుంటు వ్యాధి



గొర్రెలు, మేకలు

నోటిగాళ్లు, కాళ్లగాళ్లు అని అంటారు. సంవత్సరంలో ఎప్పుడైనా, నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఎక్కువగా సోకుతుంది. వైరస్ వల్ల గాలి, శ్వాస ద్వారా సోకుతుంది.

లక్షణాలు : జ్వరం, చొంగ కార్చడం, నోటిలో, కాలిగిట్టల మధ్య పుండ్లు పుట్టడం, మేత మేయక పోవడం, కుంటుట దీని లక్షణాలు.

చికిత్స : యాంటిబయాటిక్స్ 3–5 రోజులు వాడాలి. 1 శాతం పోటాషియం పర్మంగానెట్ ద్రావణంతో పుండ్లను శుభ్రం చేసి నోటిపుండ్లకు బోరో గ్లిజరిన్, కాలిపుండ్లకు జింక్ ఆయింట్‌మెంట్ పూయాలి.

నివారణ: మార్చి నేలలో టీకాలు వేయించాలి.

మూతిపుండ్ల వ్యాధి (కంటేజియస్ ఎక్తిమా)

వైరస్ ద్వారా చలికాలంలో ఎక్కువగా సోకుతుంది.

లక్షణాలు : ముక్కు రంధ్రాలు చుట్టూ ఎర్రగా పోక్కులు ఏర్పడతాయి. పెదవులు కలిసే చోట ఎర్రగా మారి, నల్లటి పోక్కులు ఏర్పడతాయి.

చికిత్స: యాంటిబయాటిక్ 3–5 రోజులు వాడాలి. 2 శాతం బోరోగ్లిజరిగ్ నోటికి పూయాలి

కంటేజియస్ కేప్లయిన్ ప్లూరో న్యుమోనియా...

మేకల్లో మైకోప్లాస్మా ద్వారా చలి కాలంలో సోకుతుంది.

లక్షణాలు: జ్వరం, నొప్పితో కూడిన పోడి దగ్గు, శ్వాస కష్టమవడం, చొంగ, ముక్కునుండి స్రావాలు కారడం.

చికిత్స : యాంటిబయాటిక్స్, యాంటి హిస్టమైన్ ఇంజక్షన్లు చేయించాలి.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరావు

భామిని: ఆదివాసీ గిరిజనులకు అటవీ హక్కుల చట్టం 2006పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. మండలంలోని బూర్జగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో అటవీ హక్కులపై వివరించారు. ముఖ్యంగా మూడు అంశాలపై వివరించారు. వ్యక్తిగత హక్కు, ఉమ్మడి హక్కు, అటవీ సంరక్షణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసోర్సుపర్సన్ సంజీవరావు, ఆర్ఓఎఫ్ఆర్ ఏసీఓ నాగరాజు, మణిగ సెక్రటరీ కొండగొర్రి చంటి, భామిని హెచ్‌టీఓ అలికాన ఎర్రన్న, సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా రహదారి నిర్మాణ పనులు

భామిని: మండలంలోని బాలేరు సచివాలయం వద్ద రహదారి, కల్వర్టు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనులు సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారుల సూచన మేరకు సచివాలయ ప్రాంగణం చుట్టూ సీసీ రోడ్డు వేశారు. కాలువ, కల్వర్టు పనులు చేపట్టారు. ఇంజినీరింగ్ అధికారులు పనులను పరిశీలించారు.



పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్, సర్పంచ్ ప్రభాకర్

నిబంధనల మేరకే విద్యుత్ రాయితీలు



కొత్తవీధిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు నిబంధనల మేరకే రాయితీ వర్తిస్తుందని ట్రాన్స్‌కో ఏఈ శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం సదరు విద్యుత్ వినియోగదారుల్లో 2 వందల యూనిట్లు మించి విద్యుత్ వాడుకుంటూ బిల్లులు చెల్లించని 48 మందిని గుర్తించారు. వారిలో 18 మంది రూ.82,300 బిల్లులు చెల్లించగా 30 మంది గృహాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. ఈ క్రమంలో ఏఈ మాట్లాడుతూ రాయితీ పొందుతున్న వ్యక్తికి రెండు మీటర్లు ఉంటే రెండు మీటర్ల పరిధిలో 3 వందల యూనిట్లు నెలలో దాటకూడదన్నారు. రాయితీ పొందుతున్న కుటుంబ సభ్యుల్లో ఎవరూ రూ.12వేల జీతంతో కూడిన ఉద్యోగస్తులై ఉండకూడదని, మెట్ట భూమి 10 ఎకరాలుగాని, పల్లపు భూమి 2.5 ఎకరాలు ఉన్నా, కారు, ఇన్‌కం ట్యాక్స్ కట్టిన వారు కుటుంబంలో ఉన్నా రాయితీ రద్దు కాబడుతుందన్నారు. నిజమైన అర్హులు రేషన్ కార్డు, ఆధార్, ఎస్సీ లేదా ఎస్టీ కుల ధ్రువీకరణ నకళ్లతో ట్రాన్స్‌కో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రాయితీ యూనిట్లకు మించి అదనంగా విద్యుత్ వినియోగం చేసిన వారు తక్షణమే బకాయిలు చెల్లించాలన్నారు. కొత్తవీధి, రెల్లివీధి, కస్పావీధితో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు రాయితీదారులకు అవగాహన కల్పించారు.

14న నీటి సంఘాల ఎన్నికలు

గరుగుబిల్లి: మండలంలో ఈ నెల 14వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు టి.బాల ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. బుధవారం ఓటర్లతో సమావేశం నిర్వహించి, ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఓటర్ల ఏకాభిప్రాయంతో ఎన్నికలు జరుగుతాయని, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక ఉంటుందన్నారు. ఏకాభిప్రాయం కుదరని పక్షంలో ఓటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

జియ్యమ్మవలస: సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు, సలహాలు చేశారు.

కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గరుగుబిల్లి: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రాణి

గరుగుబిల్లి: కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులతో మంగళవారం సమావేశమైన ఆమె.. కిశోరి వికాసంపై పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అలాగే కిశోరి బాలికలకు పౌష్టికాహారం–దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. బాలికల అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని, బడి మధ్యలో మానేసిన విద్యార్థులను బడిలో చేర్పించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి, డీసీపీవో ఎ.సత్యనారాయణ, ఎస్ఐ పి.రమేష్ నాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి కెకె సాగర్ వర్మ, ఎంఈవో దత్తి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ మాట్లాడుతూ కిశోరి బాలికల ఆరోగ్యానికి చర్యలు తీసుకోవాలని, వారు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. సాల్మన్‌రాజు, ఎంఈవో బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: మండల కేంద్రంలో సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ పి.రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను క్లిక్ చేయొద్దని, ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఎవరికీ చెప్పవద్దన్నారు. పిల్లలు స్మార్ట్‌ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్స్ ఆడకుండా చూడాలన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



బాల్య వివాహాల అడ్డుకట్టకు అందరి సహకారం అవసరమని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. వీరఘట్టంలోని వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కిశోర వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ బాలిక కనీసం పదో తరగతి చదివేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. రక్తహీనత ఉండే చిన్నారులు, బాలికలను గుర్తించి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. సీడీపీఓ సిమ్మాలమ్మ, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీధర్, జిల్లా ఎన్‌జీఓ కో–ఆర్డినేటర్ రాజశేఖర్, ప్రవీణ్, సూపర్‌వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. – వీరఘట్టం

ఆహా.. ఏమి రుచి..



భామిని మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల భోజనాన్ని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మంగళవారం స్వయంగా రుచి చూసి మెచ్చుకున్నారు. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో పీఓ వెళ్లి విద్యార్థులతో పాటు భోజనం రుచి చూశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ బిడ్డిక రవికుమార్, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు. – భామిని

ధాన్యం కొనుగోలు చేసేదెప్పుడు!

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు

పాలకొండ రూరల్: ఖరీఫ్ వరి కోతలు, నూర్పిళ్లు దాదాపు పూర్తి కావచ్చాయని ఈ క్రమంలో ధాన్యం కొనుగోలు పూర్తి స్థాయిలో చేపట్టాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. పాలకొండ నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి దాదాపు 40కి పైబడి ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి కేవలం 2800 మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారని మండిపడ్డారు. ఓ వైపు తుఫాన్ హెచ్చరికలు చేస్తూ రైతుల నుంచి ధాన్యం సేకరణలో వెనకడుగు వేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దళారుల దందా సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళారుల బారిన పడిన రైతులు ఎకరాకు సుమారు రూ.3,500 నష్టపోతూ తప్పనిసరి పరిస్థితుల్లో వారికే విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ లెక్కన పాలకొండ నియోజకవర్గంలో 59 వేల ఎకరాల్లో వరి సేద్యం జరగ్గా సుమారు రూ.1.24కోట్లు దోపిడీకి గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నాతగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంటల బీమాతో రైతుకు ధీమా



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ

వీరఘట్టం: ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం జరిగితే పంటల బీమా వర్తించేలా ఈ రబీలో వేసిన మొక్కజొన్న, పెసర, వరి పంటలకు బీమా చేయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి జక్కువ సౌజన్య సూచించారు. మండలంలోని చిదిమి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంటల బీమాతో రైతు ధీమాగా ఉండవచ్చునన్నారు. పూర్తి వివరాలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మరిన్ని సేవలు



దుర్గమ్మ సన్నిధిలో నూతన బస్సులకు పూజలు చేయిస్తున్న ఆర్టీసీ అధికారులు

పాలకొండ రూరల్: ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రయాణికులకు మరిన్ని సేవలు అందిస్తామని పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ డిపో నుంచి కొత్తగా నాలుగు బస్సులు మంజూరు కాగా వాటిని ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం కోట దుర్గమ్మ దేవస్థానం వద్ద మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బస్సులు పాలకొండ నుంచి శ్రీకాకుళం, విశాఖకు నడిపిస్తామన్నారు. చీపురుపల్లి వద్ద రైల్వే వంతెన పూర్తయిన వెంటనే నేరుగా ఈ బస్సులు విశాఖకు నడిపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎఫ్ ఎల్.రాము, ఏఎంఎఫ్ జగన్నాధం, టైర్ల ఏడీసీ బీకే మూర్తి, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

వీరఘట్టం:

గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. మండలంలోని తూడి, సంత–నర్సిపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సదస్సుల్లో భూ రికార్డుల్లో తప్పులుగా ఉన్న రైతుల పేర్లు మార్చాలని, ఆధార్ నంబర్లు సరిచేయాలని, విస్తీర్ణం తక్కువగా ఉందని తదితర 21 వినతులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వే డీటీ ప్రసాదరావు, ఆర్.ఐ లక్ష్మంనాయుడు, వీఆర్ఓ పాన్నాడ రఘునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి



సూచనలిస్తున్న వ్యవసాయాధికారి శ్రీదేవి

సీతంపేట: రబీలో మొక్కజొన్న, వరి పంటలకు ఇన్సురెన్స్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. మండలంలోని పొలం పిలుస్తోంది కార్యక్రమం తుంబకొండలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. రాగల రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున వరికోతలు రైతులు చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



కీసరిగూడలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కీసరిగూడ, డోలుకోన గ్రామాల్లో దోమలనివారణ మందు పిచికారీ మంగళవారం చేపట్టారు. తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ప్రధాన వీధులు, మురుగు కాలువల వద్ద దోమల మందు స్ప్రే చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజల్లో చాలామంది మలేరియా జ్వరం బారిన పడుతుండడంతో నివారణ చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

సచివాలయ భవనాలు ప్రారంభం



సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ: మండలంలోని ఉసిరి, చోళ్లపదం గ్రామాల్లో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాలను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ప్రారంభించారు. అలాగే రామభద్రపురం–అల్లువాడ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శివయ్య, ఎంపీడీవో మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ కడ్రక అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించాలి



పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించాలని ఉప విద్యాశాఖాధికారి పి.నారాయుడు అన్నారు. పొల్ల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల చదువులను ఆయన పరిశీలించారు. ఈ నెలాఖరు నాటికి సిలబస్ పూర్తి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతీ సబ్జెక్టు టీచర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. రోజువారి టెస్టులు నిర్వహించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. హెచ్ఎం మీనక భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

హక్కుల సాధనలో రాజీ పడొద్దు..



ప్రజలు తమ హక్కుల సాధనలో రాజీ పడాల్సిన అవసరం లేదని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సలహా మండలి చైర్మన్ ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులు – భంగం కలిగితే తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.
– పాలకొండ రూరల్